క్లుప్తంగా

ఐఎన్ఎంఓకి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న సంకల్ప్ కోచింగ్ సెంటర్ అధినేత వంశీ కృష్ణ, రేణుక

కడప ఎడ్యుకేషన్: కడప మారుతీనగర్‌కు చెందిన వేద చరణ్‌రెడ్డి ఇండియన్ నేషనల్ మ్యాథమాటిక్స్ ఒలింపియాడ్(ఐఎస్ఎంఓ)కు అర్హత సాధించి ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి కడప నాగార్జున మోడల్ స్కూల్‌లో చదువుతూ.. సంకల్ప్ కోచింగ్ సెంటర్ అధినేత వంశీకృష్ణ వద్ద శిక్షణ తీసుకుంటూ ఈ పరీక్షను రాశాడు. రాయలసీమ జిల్లాల నుంచి 12 ఏళ్ల తరువాత ఈ వేద చరణ్‌రెడ్డి ఈ ఐఎస్ఎంఓకు ఎంపిక కావడం హర్షణీయం. ఈ ఐఎస్ఎంఓకు రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది విద్యార్థులు మాత్రమే ఎంపికయ్యారు. వీరిలో కడపకు చెందిన వేదచరణ్‌రెడ్డి ఉండటం గొప్ప విషయం అని విద్యావేత్తలు పేర్కొన్నారు. వేదచరణ్‌రెడ్డి తండ్రి వేణుగోపాల్‌రెడ్డి క్లాస్ -1 కాంట్రాక్టరుగా, తల్లి శిరీష గృహిణిగా ఉన్నారు. తమ కుమారుడు ఐఎస్ఎంఓకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు. మా బాబు ఐఎస్ఎంఓకు ఎంపిక కావడం వెనక సంకల్ప్ కోచింగ్ సెంటర్ అధినేత వంశీకృష్ణ కృషి ఎంతో ఉందని అన్నారు. ఆయన రుణం తీర్చుకోలేనిదని వారు అన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ముస్లిం ప్రముఖులు

కడప కల్చరల్ : స్థానిక ఎల్ఎఫ్ వీధిలోని లజనతుల్ ఉలమా వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం సొసైటీ కార్యదర్శి మౌల్వి ఖ్వాజీ షేక్ మహమ్మద్ అలీ రషాది ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అస్తానె హుసేనియా పీఠాధిపతి హజరత్ మౌలానా మౌల్వి సయ్యద్ షహజాద్ హుసేనీ సాహెబ్, ఏపీ మజాయక్ బోర్డు కార్యదర్శి ఖ్వాజీ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారిలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటిలాగా ఈ ఏడాది కూడా ఉర్దూ, అరబ్బీ, ఇంగ్లీషు భాషల్లో క్యాలెండర్లను రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు హఫీజ్ సయ్యద్ అస్గర్ అలీ సాహెబ్, మౌలానా నూరుల్లా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టూడెంట్స్ ఫెస్ట్

కడప కల్చరల్ : స్టూడెంట్స్ ఫెస్ట్-2023 ఉత్సవాన్ని సోమవారం సాయంత్రం 6.30 గంటలకు స్థానిక సీఎస్ఐ హైస్కూలు ఆవరణలో నిర్వహించనున్నట్లు బెయేర్షబా చర్చి పాస్టర్ ఎ.ఆనంద్‌రాజ్ తెలిపారు. క్రీస్తు జననం మానవాళికి గొప్ప వరం లాంటిదని, ఆయన బోధనలు, మార్గదర్శకాలు విద్యార్థుల్లో నూతన శక్తిని నింపి ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. యువత అభ్యున్నతి కాంక్షిస్తూ ప్రతి ఏడాది స్టూడెంట్స్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం కూడా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా డాక్టర్ జీవన్ ప్రమోద్ హాజరై ప్రసంగిస్తారని, విద్యార్థులు సాధించాల్సిన గమ్యాల గురించి పలు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్‌తోపాటు దైవ సందేశం కూడా ఉంటుందని తెలిపారు.

శిల్పారామంలో ఆటా-పాట అదుర్స్



కడప కల్చరల్ : ఆదివారం ఆటవిడుపులో భాగంగా కడప నగర పరిధిలోని శిల్పారామంలో ప్రదర్శించిన ఆటా-పాట అదుర్స్ అనిపించాయి. అందులో భాగంగా కమలాపురం కిశోర్ డ్యాన్స్ అకాడమి సభ్యులు ప్రదర్శించిన నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పదేపదే వారు తమ కరతాళ ధ్వనులతో కళాకారులను ప్రోత్సహించారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని ఆర్టీఏ కార్యాలయం వద్ద ఉన్న అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అన్నమాచార్య విద్యా సంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సుధాకర్‌రెడ్డి, సమావేశ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వి.నాగేశ్వర్‌రెడ్డి, అన్ని విభాగాల హెచ్ఓడీలు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవాలయాల్లో వైభవంగా పూజలు

- ప్రారంభమైన ధనుర్మాస కార్యక్రమాలు



విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : జిల్లాలోని వైష్ణవాలయాలలో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ మాసం ప్రారంభం సందర్భంగా ఆదివారం ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు అభిషేకాలకు హాజరయ్యారు. తొలిమంచు వేళలో సూర్యకిరణాలు భూమాతను స్పృశిస్తున్న ఘడియల్లో భక్తిభావంతో వచ్చే ప్రజలతో ఆలయాలు కళకళలాడాయి. వైష్ణవ ఆలయాలలో తిరుప్పావై పూజలు ప్రారంభించారు. ఉదయం స్వామి, గోదాదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం సూర్యోదయానికి ముందే సామూహికంగా విష్ణు సహస్ర నామా పారాయణాలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు ప్రత్యేకంగా పగలు పత్తు కార్యక్రమంలో భాగంగా గోదాదేవి తిరుప్పావై పాశురాల పారాయణం చేశారు. అనంతరం నివేదన, నక్షత్ర కుంభ హారతులు, చతుర్వేద స్వస్తి, భజనలు, తీర్థ ప్రసాద వినియోగం చేశారు.

దేవునికడపలో..

దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 4.30 గంటలకే పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఉత్తరం వైపుగల శ్రీ ఆండాళ్ అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకారాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి రోజు ఒకటి చొప్పున పాశురాలను గానం చేయడంలో భాగంగా పండితులు తొలి పాశురాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరికొన్ని వైష్ణవాలయాలలో కూడా ప్రతి రోజు 30 పాశురాలను ఆలపిస్తారు.

శ్రీ లక్ష్మీసత్యనారాయణ ఆలయంలో..

కడప నగరం గడ్డిబజారులోని శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి విశేష అభిషేకాలు, దేవతామూర్తులకు అలంకారం, ఆరాధన నిర్వహించారు. పాశురాల ఆలాపన, విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా పాశురాల పారాయణం చేశారు. అనంతరం వారందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాలు 30 రోజులపాటు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఇంకా..

కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలోగల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, జవుళి బజారు (బీకేఎం వీధి) శ్రీ కోదండ రామాలయం తదితర వైష్ణవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జవుళి బజారు రామాలయంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేద పండితుల ఆధ్వర్యంలో పాశురాల గానం, ధనుర్మాసం విశిష్టతలపై ప్రసంగాలు చేశారు.

పెన్షనర్ల సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న ఉప ఖజానాధికారి రవికుమార్



పదవీ విరమణ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్ : విశ్రాంతి ఉద్యోగులు జాతి నిర్మాణ సారధులని, వారి అనుభవం అపారమైనదని కడప ఉప ఖజానాధికారి రవికుమార్ అన్నారు. వారి సూచనలు ఆచరిస్తే ఏ దేశమైనా అభివృద్ధి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగులు వారి ఉద్యోగ సర్వీసులో ఎంతో సేవ చేసి జనాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పాటుపడ్డారని పేర్కొన్నారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సంఘం అభివృద్ధి, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్స్ నాగమునిరెడ్డి, రాధాకృష్ణ, బాలయల్లారెడ్డి నేతృత్వంలో 75 వసంతాలు పూర్తి చేసుకున్న 38 మంది పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ ఉద్యోగులు గానుగపెంట హనుమంతరావు, నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, చలపతి, చలపతి నారాయణ, నాగయ్య, బద్వేల్ పెన్షనర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సంక్రాంతి గ్రామీణ సంబరాలు



మాట్లాడుతున్న పీడీ కె.రామసుబ్బారెడ్డి



కబడ్డీ పోటీకి హాజరైన క్రీడాకారులు

కడప కల్చరల్ : సంక్రాంతి పండుగ సందడి ప్రారంభమైంది. కడప నగరానికి చెందిన రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఏడు రకాల గ్రామీణ రకాల పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమంలో భాగంగా పది బృందాలు కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహ భరితంగా పోటీలు సాగాయి. వైవీయూ పీడీ డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి కార్యక్రమాలను సమన్వయం చేశారు. సేవా సమితి కార్యదర్శి లెక్కల కొండారెడ్డి ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలకు ముందు సభా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామసుబ్బారెడ్డి వ్యాయామం ద్వారా బాలలు, యువతకు ఆరోగ్యంతోపాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. పురాణాలలో క్రీడలకు ఇచ్చిన ప్రాధాన్యత గురించి ఆయన సోదాహరణంగా వివరించారు. సంస్థ అధ్యక్షులు కె.నాగిరెడ్డి మాట్లాడుతూ అంతరించిపోతున్న ప్రాచీన, గ్రామీణ క్రీడలను నేటి తరానికి పరిచయం చేసేందుకు ఈ సందర్భాన్ని వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి, శివశివాని హైస్కూలు కరస్పాండెంట్ కె.నాగేంద్రారెడ్డి, ఎల్.నాగిరెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, శివనారాయణ, మద్దిక సుబ్బారెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకటరెడ్డి కూడా గ్రామీణ క్రీడల రక్షణ అవసరం గురించి, సంక్రాంతి సంప్రదాయాల గురించి మాట్లాడారు. లెక్కల కొండారెడ్డి తన ప్రసంగంలో ఈ నెల 24న సంక్రాంతి గ్రామీణ క్రీడా సంబరాల్లో భాగంగా కర్రసాము, చెక్కభజన, టగ్ ఆఫ్ వార్, కోలాటం పోటీలు నిర్వహిస్తామని, సంవత్సరాంతం రోజు డిసెంబరు 31న మహిళలకు ముగ్గుల పోటీలు, జనవరి 7న బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 13న విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

ఈ వ్యర్థాలు ఎప్పుడు ఎత్తుతారో..!



ఎన్జీవో కాలనీలోని రోడ్డుపై ఒకవైపు వేసిన వ్యర్థాలు

కడప కార్పొరేషన్: కడప నగరంలో వై జంక్షన్ నుంచి ఎడమవైపు డ్రైనేజీ కాలువ పనులు జరుగుతున్నాయి. మొదట్లో కొంత వేగంగా జరిగినా ఈ పనులు ఈ మధ్య నెమ్మదించాయి. ప్రస్తుతం ఎన్జీవో కాలనీలో డ్రైనేజీ కాలువను తవ్వేసి ఆ వ్యర్థాలను రోడ్డుపై పడేశారు. నెల రోజులవుతున్నప్పటికీ ఆ వ్యర్థాలను తొలగించలేదు సరికదా...కాలువ నిర్మాణ పనులు కూడా చేయలేదు. ఈ ప్రాంతంలో అప్సర నుంచి ఆర్టీసీ బస్టాండుకు ఇదే మార్గం గుండా వెళ్లాల్సి రావడం, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఎక్కువగా ఉన్నందున ఈ రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. అయితే డివైడర్‌కు ఎడమ వైపునంతా ఈ వ్యర్థాలు, కంకర, ఇసుక వేయడంతో నెల రోజులుగా వచ్చిపోయేవారు ఒకవైపునే ప్రయాణించడం వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. భారీ వాహనాలకు ప్రవేశం లేకుండా నిరోధిస్తున్నారా... అంటూ అదీ లేదు. కల్వర్టులు పగుల గొట్టడం వల్ల చాలా వీధుల్లోకి పోవడానికి మార్గమే లేకుండా పోయింది. అభివృద్ధి పనులు వేగంగా చేసే హడావిడిలో ప్రజలు ఇబ్బందులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ట్రాఫిక్ పోలీసులు సైతం ట్రాఫిక్‌ను నియంత్రించలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీనగర్ కాలనీలో వెలసిన రామాలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా సోమవారం శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సుబ్రహ్మణ్య స్వామి హోమం, అనంతరం స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందాలన్నారు.

గిరిజన భవన్‌ను ప్రారంభించాలి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అన్ని హంగులతో నిర్మించి, వినియోగానికి సిద్ధంగా ఉన్న గిరిజన భవన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిచే ప్రారంభోత్సవం చేయించాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బి. వేణుగోపాల్ నాయక్ కోరారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ విజయ్ రామరాజుకు వినతి పత్రం సమర్పించారు. పేద గిరిజనులు పెళ్లిళ్లు, సమావేశాలు, సంప్రదాయ కార్యక్రమాలకు వినియోగించుకునేందుకు వీలుగా గిరిజన భవన్‌ను రూ.1.35 కోట్లతో నిర్మించారన్నారు. అధికారులు ఈ భవన్‌కు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచారన్నారు. ఈ నెల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్నందున ఆయనచే ఈ భవన్‌ను ప్రారంభోత్సవం చేయించాలని కోరారు.

ఆటా సదస్సుకు కడప అధ్యాపకుడు



ఆటా సదస్సులో మాట్లాడుతున్న వైవీయూ ఆచార్యులు తప్పెట రాంప్రసాద్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో ఆదివారం ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సు-2023ను ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సులో కడప యోగివేమన విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఆచార్యులు తప్పెట రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళలు అతి ప్రాచీనమైన ప్రదర్శన కళలన్నారు. ఇవి మానవుని అనుభూతులకు, మానసిక చైతన్యానికి, ఆనందోత్సాహాలకు ప్రతీకలని వివరించారు. అందువల్లనే ఇవి అనంతమైన రూపవైవిధ్యం కల్గి ప్రజా జీవితానికి అత్యంత సన్నిహితంగా ఉంటాయన్నారు. ఈ జనపద కళలు ప్రజల మధ్యే పుట్టి పెరిగి ప్రజల కోసం అనేక వందల సంవత్సరాల నుంచి సజీవంగా ఉన్నాయన్నారు. ఇందులో కొన్ని కళలు కనుమరుగైనా మరికొన్ని నేటికీ సజీవంగా ఉన్నాయని, ఈ జానపద సంపద జాతికి గర్వకారణం అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రాంతంలో చూసినా వివిధ కులాలకు సంబంధించిన విశిష్టమైన జానపద కళారూపాలు అనేకమున్నాయన్నారు. ప్రతి కళారూపంలోనూ ఆయా కులాలకు సంబంధించిన విశ్వాసాలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, వేషభాషలు కనిపిస్తాయని వివరించారు. కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు.

'మోదీ పాలన దేశానికి ప్రమాదం'



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అసమర్థ ప్రధాని మోదీ పాలనలో భారతదేశం పెను ప్రమాదంలో పడిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈవీఎంలు అంకెల గారిడీతో అధికారం చలాయిస్తున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం, లౌకికవాదం, మతసామరస్యం, సోదరభావం వంటివి ఖూనీ చేస్తోందన్నారు. ఇటీవల లోక్‌సభలో కొందరు వ్యక్తులు చొరబడి దేశ అత్యున్నత చట్ట సభల విధులకు భంగం కలిగించడం కాకుండా, సభ్యులను భయభ్రాంతులకు గురి చేయడం శోచనీయమన్నారు. పార్లమెంట్ భద్రతా వలయాన్ని ఛేదించి అగంతకులు లోనికి ప్రవేశించి అలజడి సృష్టించడం దారుణం అన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చట్టసభలకు హాజరు కాకుండా, ప్రభుత్వం నుండి దేశభద్రత, పార్లమెంటు భద్రతపై చెప్పకుండా తప్పించుకు తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటరమణారెడ్డి, రహమతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'పుత్తా' ఉనికి కోసం పాకులాడుతున్నాడు



ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డితో సోముల నారాయణరెడ్డి

చింతకొమ్మదిన్నె : టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తన ఉనికి కోసం పాకులాడుతూ దారిన కనబడిన వారందరికీ కండువాలు వేస్తూ పార్టీలో చేరారని డప్పు కొట్టుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు సోముల నారాయణరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మామిళ్లపల్లెలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మామిళ్లపల్లెలో పర్యటించారని, ఇందులో భాగంగా తన స్వగృహానికి వచ్చి మంచినీరు అడిగితే తాము ఇచ్చామే తప్ప పార్టీలో చేరలేదని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆయన పత్రికలకు ఇచ్చిన ప్రకటనలను ఖండిస్తూ తాము ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసి తాము ఎప్పటికీ వైఎస్సార్ సీపీ విధేయులమని, రవీంద్రనాథ్‌రెడ్డికి ఆప్తమిత్రులమని తెలిపారు. ఇలాంటి దుర్మార్గమైన చర్యలు ఇప్పటికైనా టీడీపీ నాయకులు మానకుంటే బాగుంటుందని హితవు పలికారు. కార్యక్రమంలో 16వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పోలీస్‌స్టేషన్‌ను కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆదివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. పరిసరాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో పచ్చదనం పెంపొందించాలనీ, ఆహ్లాదకరంగా వుండేలా చర్యలు చేపట్టాలని రిమ్స్ పీఎస్ సీఐ కె. రామచంద్రకు సూచించారు. తరువాత రికార్డులను పరిశీలించారు. దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 'దిశ' రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలనివాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



అంగన్‌వాడీల ఆందోళనలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు మనోహర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్‌వాడీ ఆయాలు, వర్కర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు మనోహర్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మెలో మనోహర్ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీల డిమాండ్లపై కనీసం చర్చలకు కూడా పిలువకుండా అవలంబిస్తున్న ఏకపక్ష ధోరణిని ఖండిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలు చెబుతున్న అంశాలన్నీ ఆమోదయోగ్యమైనవేనని తెలిపారు. సీఎం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఇప్పటికైనా వీరి న్యాయమైన సమస్యలు పరిష్కరించి, అంగన్‌వాడీలను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులతోపాటు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లతోపాటు జిల్లాలో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి జ్యుడిషియల్ ఎంప్లాయీస్ వినతి



న్యాయమూర్తి బి.ఎస్.భానుమతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జ్యుడిషియల్ ఎంప్లాయీస్

కడప అర్బన్ : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు పోలియో జడ్జి బి.ఎస్. భానుమతికి కడప జిల్లా జ్యుడిషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వారు పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం స్టేట్ గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకున్నారు. ఈ క్రమంలో జిల్లా జ్యుడిషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వారు కలిశారు. మహిళలకు సంబంధించిన ఐదు రోజుల సీఏఎల్స్, సూపరింటెండెంట్స్ ప్రమోషన్‌లపై విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జ్యుడిషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.భాస్కర్, జనరల్ సెక్రటరీ నార్సరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ అహ్మద్ బాషా, ఇతర సభ్యులు పాల్గొన్నారు.


విజయదుర్గమ్మ సన్నిధిలో..

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి బీఎస్ భానుమతి అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా జడ్జి జి.శ్రీదేవి, రెండవ అదనపు జిల్లా జడ్జి భార్గవిలతో కలిసి వచ్చిన ఆమెకు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరెడ్డి, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌లు సంప్రదాయ స్వాగతం పలికారు. ప్రదక్షిణల అనంతరం అమ్మవారి మూల విరాట్‌ను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట-బుగ్గేటిపల్లి సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి పంచామృతాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

సదస్సులతో ఉత్తీర్ణత సులభతరం



బ్లాక్‌బోర్డుపై వివరిస్తున్న ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర నాయకుడు సీవీ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: అవగాహన సదస్సులతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సులభతరం అవుతుందని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర నాయకుడు సీవీ ప్రసాద్ అన్నారు. ఆదివారం కడప ఎన్‌జీవో భవన్‌లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ పరీక్షలపై ఉద్యోగ, ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీటీఎఫ్ అమరావతి బిట్స్ బుక్‌లెట్స్ ద్వారా సక్సెస్ రేటు ఎక్కువగా ఉంటుందన్నారు. విద్యకు సంబంధించిన నిబంధనలు, సీసీఏ రూల్స్, సబార్డినేట్ సర్వీస్ రూల్స్, జెడ్పీ యాక్టుపై పట్టు సాధించడం వంటి అంశాలతో గెజిటెడ్ ఆఫీసర్ టెస్టు ఉత్తీర్ణత సులభతరం అవుతుందన్నారు. అలాగే పెన్షన్, బడ్జెట్, ఫైనాన్స్, రాజ్యాంగంపై విశ్లేషణాత్మకమైన ప్రశ్నావళిని నల్లబల్లపై వివరిస్తూ.. సమాధానం చేసే విధానాలను తెలియజేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో తమ సంఘం ఆధ్వర్యంలో మాక్‌టెస్టుల రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. విద్యాక్రాంతి డాట్ ఇన్ నుంచి దిగుబడి చేసుకుని ప్రాక్టీసు చేసుకోగలరని వివరించారు. రాష్ట్ర విద్యా ఐటీ సెల్ ప్రతినిధి రెహమాన్ మాట్లాడుతూ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించుటకు చేపట్టాల్సిన ప్రయత్నాల గురించి వివరించారు. ప్రశ్నా పత్రానికి జవాబు చేసే విధానంలో ఉన్న ట్రిక్‌లను ప్రత్యేకంగా ఉపాధ్యాయులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఈశ్వరచంద్ర మాట్లాడుతూ కడప జిల్లా శాఖను సంప్రదించినచో బిట్స్ బుక్‌లెట్‌ను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బర్సీ మహోత్సవం



ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా-ఏ-గఫారియాలో శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం దర్గా పీఠాధిపతి, సజ్జాదే నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో అశేష భక్త జన సందోహం నడుమ బర్సీ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాత బస్టాండు సమీపంలోని గంధం ఇంటి నంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో గంధంను ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. బాణా సంచా పేల్చుతూ, డప్పు వాయిద్యాల నడుమ జరిగిన ఊరేగింపులో యువకులు వివిధ రకాల నృత్యాలు చేశారు. ఊరేగింపు దర్గా చేరుకున్న అనంతరం భక్తులు పీఠాధిపతి ఆధ్వర్యంలో స్వామి వారి మజార్లపై పూల చాదర్ సమర్పించి, గంధం ఎక్కించారు. ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి భక్తులందరికి గంధం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరిస్వామి, మౌలానాస్వామి, గౌస్‌పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్ పాల్గొన్నారు.